క్లుప్తంగా

పోలీస్ కమిషనర్‌కు న్యాయవాది ఫిర్యాదు

దుగ్గొండి : సమాచార హక్కు చట్టం కింద అడిగిన వివరాలు ఇవ్వడం లేదంటూ వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిశోర్ ఝాకు మండలంలోని బంధంపల్లికి చెందిన న్యాయవాది ఉస్సేన్‌పల్లి విరాట్ సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు గత ఆర్నెళ్లలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్నిటిని ఆన్‌లైన్ చేశారు?, తదితర వివరాలు కోరుతూ తాను పోస్టు ద్వారా దరఖాస్తు పంపితే తీసుకోకుండా తనకు తిప్పి పంపుతున్నారని పేర్కొన్నారు. సహ చట్టం పోలీస్ శాఖకు వర్తించదా? అని ప్రశ్నించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

నివాళి



నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు తల్లి లక్ష్మి (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, సాయికృష్ణ, బెజ్జంకి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ




దుగ్గొండి : మండలంలోని బంధంపల్లికి చెందిన ఎక్కటి మనోజ్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు కాట్ల భద్రయ్య, అంకిల్ల రవి, నాగనబోయిన తిరుపతి, శ్రవణ్‌కుమార్, శంకర్‌రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నల్లబెల్లి : మండలంలోని రాంతీర్థంకు చెందిన మాట్ల స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు అవియుక్త్ రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అవియుక్త్‌రెడ్డి పంపిన రూ.10 వేల నగదును బాధిత కుటుంబానికి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్ అందజేశారు. తొలుత స్వామి చిత్రపటానికి సురేశ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాలోత్ మోహన్, బత్తిని మహేశ్, బేతి భరత్, స్వామి, రవి, దీక్షపతి, కళ్లెపెల్లి రాజేశ్, అరుణ్, అరవింద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన యాదగిరి రాజు మృతి చెందగా అతడి అంత్యక్రియల కోసం స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, ఎన్ఆర్ఐ (సైంటిస్ట్) డాక్టర్ పసునూటి కల్యాణ్ బాధిత కుటుంబానికి సోమవారం రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కర్ణకంటి రామ్మూర్తి, ముల్క సత్యనారాయణ, బోడకుంట్ల ప్రభాకర్, మహ్మద్ సోనీ, పొగాకు కుమారస్వామి, జోజుల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీసీ చర్చికి రేకుల బహూకరణ

దామెర : మండలంలోని పులుకుర్తిలో తెలుగు బాప్టిస్టు చర్చిలోని స్టేజీపై సోమవారం రేకులు బహూకరించి షెడ్డు ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు తన తండ్రి మెంతుల (పెంచాల) మల్లయ్య జ్ఞాపకార్థం రేకుల షెడ్డు అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ జాన్సన్, సంఘ పెద్దలు, యువకులు రాజును అభినందించారు.

జోరుగా గంజాయి దందా!

- చాప కింద నీరులా వ్యాపారం
- బానిసలుగా మారుతున్న యువత



గంజాయి రవాణాదారుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్)

వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి దందా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. చాపకింద నీరులా గంజాయి విక్రయాలు విస్తరిస్తున్నట్టు సమాచారం. గతేడాది పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నా ఎక్సైజ్ పరిధిలో ఇప్పటివరకు కేసులు నమోదు కాకపోవడం గమనార్హం. తనిఖీలు లేకపోవడంతో చేరాల్సిన చోటికి సరుకు అలవోకగా చేరుతోందని తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో గంజాయి రవాణాదారుల ఆటకట్టించలేకపోతున్నారన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి, సంగెం మండలాల్లో గంజాయి దందా జోరుగా సాగుతుండడంతో యువత బానిసలుగా మారుతున్న దుస్థితి నెలకొంది.

చీకటి పడితే గుంపులుగా..

వర్ధన్నపేట పట్టణంతోపాటు పలు పల్లెల్లోనూ చీకటి పడితే యువకులు రహస్య ప్రదేశాల్లో గుంపులుగా చేరి గంజాయిని సిగరెట్లతో తాగుతూ మత్తుకు లోనవుతున్నారు. ప్రధానంగా యువత, మైనర్లు గంజాయికి అలవడుతున్నారు. కొన్ని చోట్ల కిరాణా దుకాణాల సమీపాల్లో సిగరేట్లు తాగేందుకు ప్రత్యేక అడ్డా ఏర్పాటు చేసుకుంటున్న దారుణం నెలకొంది. అలాంటి ప్రదేశాలకు కొందరు గంజాయి తీసుకొచ్చి సేవిస్తున్నట్టు సమాచారం.

గంజాయి రవాణాపై గతంలో పోలీసు కేసులు

గంజాయిని గతంలో వర్ధన్నపేటకు కార్లలో రవాణా చేయగా పోలీసులు పెద్దఎత్తున్న స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. 2024 సెప్టెంబర్ 24న పట్టణంలోని బస్టాండ్ వద్ద బీహార్ ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి 27.41 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు సైతం నమోదు చేశారు. అలాగే పర్వతగిరి, సంగెం మండలాల్లోనూ గంజాయి పట్టుబడడం ఆందోళన కలిగిస్తోంది. అయినా వర్ధన్నపేట పట్టణంతోపాటు పలు గ్రామాలకు, పరిసర మండలాలకు గంజాయి రవాణా విస్తరిస్తున్నట్టు తెలుస్తోంది. గంజాయి విక్రేతలు ముఖ్యంగా కళాశాలలు, హైస్కూళ్లలో విద్యార్థులకు అలవాటు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

నిఘా పెంచుతాం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిఘా పెంచుతాం. గంజాయి రవాణాపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. యువత, విద్యార్థులు గంజాయికి బానిసలు కావొద్దు. గుడుంబా నివారణకు ప్రత్యేక దృష్టి సారించాము. గంజాయి రవాణా, విక్రయాలుంటే పూర్తిగా నిర్మూలించే దిశగా కార్యాచరణ చేపడతాం. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తప్పవు. గంజాయి రవాణా, విక్రయాలను నిరోధించేలా ప్రజలు సమాచారం అందించి సహకరించాలి. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– స్వరూప, సీఐ, ఎక్సైజ్ శాఖ, వర్ధన్నపేట

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- ఆభరణాలు, నగదు స్వాధీనం
- ఏసీపీ అంబటి నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నర్సయ్య

వర్ధన్నపేట : తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 82 గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణలతోపాటు రూ.80 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ అంబటి నర్సయ్య వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన జాడి శ్రీకాంత్ చికెన్ సెంటర్‌లో కూలీగా పని చేసేవాడు. ఆదాయం జల్సాలకు సరిపోకపోవడంతో వర్ధన్నపేటలోని ఫిరంగిగడ్డ, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లోని ఇళ్లలో 82 గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణాలతోపాటు రూ.1.05 లక్షల నగదు చోరీ చేశాడు. వాటిని స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కోడెం గణేశ్ ఇంట్లో దాచాడు. జాడి శ్రీకాంత్ గతంలో ధర్మసాగర్‌లో చోరీకి పాల్పడగా పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగిలించిన ఆభరణాలు తొర్రూరులో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ సందర్భంగా మండలంలోని దమ్మన్నపేట వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీపీ చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు చందర్, రాజు, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారంటూ వారిని ఏసీపీ నర్సయ్య అభినందించారు.

వినికిడి సమస్యను సకాలంలో గుర్తించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు, పీహెచ్‌సీ సిబ్బంది

చెన్నారావుపేట : వినికిడి సమస్యలను సకాలంలో గుర్తించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సరోజ సూచించారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్న పిల్లల్లో సమస్యను ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్యం అందించాలని సూచించారు. వైద్యుల సలహాల మేరకు వినికిడి యాంత్రాలు వినియోగించాలని కోరారు. తొలుత ర్యాలీ నిర్వహించారు.

వైద్యశిబిరం

మండలంలోని జోజిపేట నారాయణతండాలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ సరోజ మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వినోద్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సువార్త, స్టాఫ్ నర్స్ హేమలత, ఫార్మాసిస్ట్ లీలా రాణి, హెల్త్ సూపర్‌వైజర్ రామెల్, వైద్య సిబ్బంది సురేందర్, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మైలారంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన జట్లకు సోమవారం ఆయన ట్రోఫీ, బహుమతులు అందజేసి మాట్లాడారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో మెరుగైన సమాజ నిర్మాణంలో యువజన పాత్ర క్రియాశీలకంగా మారిందని చెప్పారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసమే కాకుండా సామాజిక అభివృద్ధికి బాటలు పడతాయని చెప్పారు. యువత జీవితంలో ఉన్నతంగా ఎదిగే దిశగా ఆలోచించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎళ్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో, వ్యక్తిగతంగా ఎలాంటి సాయం చేయడానికైనా వెనుకాడబోనని తెలిపారు. అనంతరం గౌడకులస్తులు నిర్వహించిన కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్, నాయకులు లేతాకుల రంగారెడ్డి, సంతోశ్, ఉల్లెంగుల శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, గబ్బెట ప్రవీణ్, కోల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం శివారులోని పూర్వ అపెక్స్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లం మర్రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆర్థికసాయంతో టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు హలావత్ భద్రు, బాదావత్ నర్సింహ, వివేక్ చౌదరి, రవీందర్, కనకయ్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ స్కూల్ పూర్వవిద్యార్థి అయిన మండల కేంద్రానికి చెందిన పసునూరి రఘు సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయ మాట్లాడారు. పూర్వవిద్యార్థి రఘు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన జీపీఏ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధాం, సునీత, శశిధర్, సంతోశ్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



నర్సంపేట : విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



నర్సంపేట రూరల్ : మహేశ్వరం హైస్కూల్‌లో..

నర్సంపేట : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మహేందర్, సహస్ర, సమీరా ఎంపికయ్యారని హెచ్‌ఎం కాంతారావు తెలిపారు. సదరు ముగ్గురు విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం ఆయన అభినందించి మాట్లాడారు. గతేడాది నవంబర్ 24న 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. ముగ్గురు విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏటా రూ.14 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందనుందని చెప్పారు. విద్యార్థులు ఇలాంటి స్కాలర్‌షిప్ పరీక్షల్లో ప్రతిభ చాటి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రాజేశ్, శౌరి అసంతీన, రాధిక, సురేశ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రవి, రాజామౌళి, రమేశ్, సుజాత, నిర్మల, స్వామి, స్వరూప, పద్మ, శ్రీలత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి పోగుల అక్షయ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను హెచ్‌ఎం స్వరూప అభినందించారు. అక్షయకు 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జున్, సాగర్, వేణుబాబు, శ్రీలత, రాజేశ్వరి, రమేశ్, రేఖ, శ్రీలత, కరుణాకర్ తదితరులు అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నల్లబెల్లి : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నల్లబెల్లి : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సర్పంచ్‌ల ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు నానబోయిన రాజారాం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారదను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అధికారుల ఒత్తిడితో గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ చెల్లించలేక మానసిక వేదనకు గురౌతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు లావుడ్య తిరుపతి, నాయకులు తంగెళ్ల రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు..

ఖానాపురం : విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్ వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేశ్, రాజేందర్ మాట్లాడారు. అశోక్‌నగర్ కాంప్లెక్స్ పరిధిలోని స్కూల్‌లో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విధులకు ఇష్టారాజ్యంగా గైర్హాజరవుతున్నాడని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వేరోస్ మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి



సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి గొల్లపల్లి ఎల్లమ్మ–బుచ్చయ్య దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కూతురు రజిత(40)కు 15 ఏళ్ల క్రితం వివాహం జరిపించగా కొద్ది రోజులకే విడాకులు అయ్యాయి. నాటి నుంచి రజిత తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈనెల 1న తల్లి ఎల్లమ్మతో గొడవ చోటు చేసుకోగా రజిత పురుగుల మందు తాగింది. తల్లి, స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి సోదరి రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ప్రజాచైతన్యంతోనే ప్రతిపక్షాలకు గుణపాఠం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

సంగెం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడం ద్వారా ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి శ్రేణులకు సూచించారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తిమ్మాపూర్, ఎల్గూర్ స్టేషన్, గాంధీనగర్, నర్సానగర్, బీకోజీనాయక్ తండాలో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అయినా ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహనాయక్, పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, నాయకులు ఆగపాటి రాజు, జగన్నాథచారి, పాషా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

- సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి

చెన్నారావుపేట : చదువుతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడతాయని సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఫేర్‌వెల్ డేకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి కీలకమని చెప్పారు. మైలు రాయి లాంటిదని అభివర్ణించారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. భవిష్యత్ ప్రణాళికతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మేడి రమేశ్, బొనగాల రమేశ్, పొన్నం రమేశ్, దామెర గణేశ్, వల్ల వేణు, కందిక నవీన్‌కుమార్, గుగులోతు భద్రు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయనం

దామెర : మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయనం చేశారు. పాఠశాలకు చెందిన 7,8 తరగతికి చెందిన విద్యార్థుల పాఠ్యాంశాలపై అవగాహన కల్పించేందుకు సోమవారం దుర్గంపేట్ గ్రామంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా చేనేత కార్మికుల కుటుంబాలను కలిశారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తులు చేసే విధానం, వారి జీవన విధానం, ఉపాధి ప్రభావితం చేసే అంశాలు, ఆర్థిక స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు డాక్టర్ రాచర్ల గణపతి మాట్లాడుతూ.. పాఠ్యాంశంలోగల అంశాలను విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. మగ్గాలపై చేనేత కార్మికుల కళానైపుణ్యం చాలా గొప్పదని అభివర్ణించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు, ట్రాలీ ఢీ

నర్సంపేట రూరల్ : పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారులో కారు, ట్రాలీ ఒకదాన్ని మరొకటి ఢీకొన్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి మీడియాకు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ నుంచి నర్సంపేట దిశగా వస్తున్న కారు నర్సంపేట నుంచి మహబూబాబాద్ వైపు ప్రయాణిస్తున్న టాటా ట్రాలీ ఎదురెదురుగా వస్తుండగా ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కాగా కారులో, టాటా ట్రాలీలో ప్రయాణిస్తున్న ఎవరికీ గాయాలు సైతం కాకపోవడం గమనార్హం.

ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టించేందుకు కేటాయించాలని డీబీఆర్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపర్తి జగన్నాథం కోరారు. పట్టణంలోని సదరు సర్వే నంబర్‌లో పేదలు గుడిసెలు వేసుకున్న ప్రదేశాన్ని ఆయన ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని గతంలో ఆర్‌డీఓకు, తహసీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన పట్టించుకోలేదని చెప్పారు. కబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. సదరు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు కోడెపాక మొగిలి, రాపోలు వెంకన్న, అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, భాగవత సక్కు, మొద్దు కోమల, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.